క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శిరివెళ్ల: కామినేనిపల్లెలో సోమవారం సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎస్సీ కాలనీలో ఆదర్శ గ్రామం కింద రూ.5 లక్షలతో రోడ్డు పనులు చేపట్టారు. అలాగే ఆంజనేయ స్వామి గుడి ముందు గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించామని సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి తెలిపారు.

కేజీబీవీ ఎస్ఓగా ఎస్.సునీత

చాగలమర్రి: రెండేళ్ల నుంచి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పాలనతో ఇబ్బందులకు గురవుతున్న స్థానిక కేజీబీవీ సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించా రు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆలూరులో ఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సునీతను చాగలమర్రి కేజీబీవీకి నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యా కానుక పంపిణీ

స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో సోమవారం సుమారు 200 మంది విద్యార్థినులకు ఎస్ఓ ఏస్.సునిత ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ 6– 10వ తరగతి విద్యార్థినులకు కిట్లను పంపిణీ చేశామన్నారు. సుమారు 40 మందికి పైగా విద్యార్థినులు 6వ తరగతిలో ప్రవేశం పొందారని చెప్పారు.

ఎంఈఓ–2 నియామకం

చాగలమర్రి: కర్నూల్ జిల్లా పెద్ద కడుబూరు మండలం, గవిగట్టు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఏస్.న్యామతుల్లా పదోన్నతిపై చాగలమర్రి ఎంఈఓ–2గా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ఉయ్యాలవాడ : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి రెండవ ఎంఈఓగా వీరప్రతాప్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

శిరివెళ్ల: మండల 2వ విద్యాశాఖాధికారిగా నాగార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెండవ ఎంఈఓ అవుకు జెడ్పీ ఉన్నత ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ పదోన్నతిపై వచ్చారు.

రుద్రవరం: మండలం రెండో ఎంఈఓగా లక్ష్మీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కోవెలకుంట్ల మండలం కనకాద్రిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు పదోన్నతి కల్పించి బదిలీపై పంపారు.

20న సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన సమావేశం

నంద్యాల: గ్రామీణాభివృద్ధికి సంబంధించి సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన సమావేశాన్ని ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎస్టీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

నంద్యాల(వ్యవసాయం): పార్లమెంట్‌లో ఎస్టీ బిల్లు ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

చాపాడు: వైఎస్సార్ జిల్లా బద్రిపల్లె గ్రామంలో అవధూత దిగంబర వీరయ్య స్వామి 46వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే నంద్యాల జిల్లా విష్ణువర్ధన్‌రెడ్డి, కడపలోని బాలాలయపల్లెకు ఎద్దులు ఏడో స్థానంలో నిలిచాయి. రూ.60వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

చేతబడి పేరిట మహిళలతో నగ్న పూజలు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

చాగలమర్రి: చేతబడి పేరిట నగ్న పూజలు చేయించడంతో పాటు రూ.9 లక్షలు కాజేసిన ఉదంతం బాధిత మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మూడేళ్ల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ భర్త అనారోగ్యంతో బాధపడుతుండగా చేతబడి చేశారని రుద్రవరం మండలం, ముత్తలూరు గ్రామానికి చెందిన బత్తులూరి లక్ష్మీనాగమ్మ అలియాస్ బోయ సాయమ్మ నమ్మబలికింది. విరుగుడుగా నగ్న పూజలు చేయాలని, అందుకు ఖర్చు నిమిత్తం రూ.3 లక్షల వరకు వసూలు చేసింది. అయితే అతని ఆరోగ్యం మరింత క్షీణించడంతో.. చేతబడి బలంగా చేశారని, తనకంటే ఎక్కువ తాంత్రిక విద్యలు తెలిసిన స్వామి నంద్యాల మండలం, చాబోలు గ్రామంలో ఉన్నాడని పోలూరు మహమ్మద్ హుసేన్‌ను బాధితురాలికి పరిచయం చేసింది. వీరిద్దరు మాయమాటలు చెప్పి మరో రూ.6 లక్షలు కాజేశారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆమెతో నగ్న పూజలు చేయించారు. విసుగు చెందిన బాధిత మహిళ మూడురోజుల క్రితం ఇద్దరినీ నిలదీయడంతో పోలూరు మహమ్మద్ హుసేన్ ఆమెను బలవంతం చేయబోయాడు. తప్పించుకున్న ఆమె చాగలమర్రి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి ముత్తలూరులో నిందితులిద్దరిని అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టులో హాజరు పరుచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ రమణయ్య వెల్లడించారు.

రైతు నేస్తాలు... ఆర్‌బీకేలు

- భూసార పరీక్షల నుంచి దిగుబడి విక్రయాల వరకు గ్రామంలోనే సేవలు
- నాలుగేళ్లుగా విశేష సేవలు
- సొంత గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు అందజేత
- పనిముట్లతో సహా అన్ని సంక్షేమ పథకాలు లభ్యం
- నియోజకవర్గంలో 28 ఆర్బీకేల ఏర్పాటు

నంద్యాల(రూరల్): ఒకప్పుడు రైతులన్నా.. వారి కష్టాలన్నా ఎవరికీ పట్టేది కాదు. అలాంటి వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారి సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) ఏర్పాటు చేశారు. ఇవి ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. వాటి ద్వారా సొంత గ్రామాల్లోనే రైతులకు అన్ని సేవలు అందుతున్నాయి. నాలుగేళ్లలో రైతు నేస్తాలుగా మారాయి.

అన్ని రకాల సేవలు..

గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయానికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల తమ సొంత గ్రామంలోనే వారికి కావలసిన సేవలన్నీ అందుతున్నాయి. భూసార పరీక్షల నుంచి దిగుబడులు విక్రయియించే వరకు తోడుగా ఉంటున్నాయి.

కియోస్క్ యంత్రంతో ఎన్నో ప్రయోజనాలు..

ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. తమకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు 48 గంటల్లోనే నేరుగా రైతులకే అందుతున్నాయి. ఇందుకు రైతులు ఆన్‌లైన్‌లో కియోస్క్ ద్వారా వాటికి ఆర్డర్ పెట్టడమే తరువాయి.

ఎరువులు, విత్తనాలు, యంత్రాల పంపిణీ..

ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లను కూడా అందజేస్తున్నారు. అలాగే కొన్ని కేంద్రాల్లో విత్తన నాణ్యతను ఉచితంగా పరీక్షించి ఫలితాలు తెలియజేస్తున్నారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించి జిల్లా కేంద్రాల్లోని ల్యాబ్‌కు పంపి ఫలితాల ఆధారంగా ఎలాంటి పంటలు సాగు చేయాలి, ఎరువులు వాడాలో సిబ్బంది అవగాహన కల్పిస్తారు. ఇక పంటల సాగు, విత్తనాలు సేకరణ,నాణ్యత, దిగుబడి, తెగుళ్లు, నివారణ, యాజమాన్యపద్ధతులు, ఉత్పత్తులను ఎక్కడ,ఎలా వినియోగాంచుకోవాలనే విషయాలపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలిస్తున్నారు.

ఈ క్రాప్ బుకింగ్, పంట నష్ట పరిహారం..

సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. తద్వారా విపత్తులు, తెగుళ్ల ద్వారా పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం పొందే అవకాశముంటుంది. ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందజేస్తున్నాయి. అలాగే దిగుబడి విక్రయించడానికి ఈ క్రాప్ బుకింగ్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. వ్యవసాయ సంబంధిత పథకాలు పొందాలన్నా దీనిని పరిగణలోకి తీసుకుంటున్నారు.



గోస్పాడు మండలం ఒంటివెలుగలో ఆర్‌బీకేలో విత్తనాలు తీసుకుంటున్న రైతులు

నియోజకవర్గంలోని ఆర్బీకేలు, లబ్ధిపొందిన రైతుల వివరాలు...	
నియోజకవర్గంలోని ఆర్‌బీకేల సంఖ్య- నంద్యాల 20, గోస్పాడు 8	
ఒక్కో ఆర్బీకే నిర్మాణానికి రూ.21.8లక్షల కేటాయింపు.	
28 కేంద్రాల భవనాలకు మొత్తం రూ.6.10 కోట్లు మంజూరు	
మొత్తం రైతులు	17,480
రైతుభరోసా పథకం మంజూరైన రైతులు	16,768
పథకం ద్వారా రైతులు పొందిన లబ్ధి	రూ.54.69 కోట్లు
ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతులు	19,654
వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పొందిన రైతులు	547
ఉద్యానవన పంటలపై సబ్సిడీ పొందిన రైతులు	8,516
వారికి కలిగిన లబ్ధి	రూ.4.48 కోట్లు



పాండురంగాపురం ఆర్బీకే కేంద్రం

నాలుగేళ్లుగా రైతు భరోసా అందుతోంది



ఆర్బీకేల ద్వారా నాకు నాలుగేళ్లుగా రైతు భరోసా పథకం అందుతోంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు ఇచ్చే పెట్టుబడి సాయం సరైన సమయంలో ఇస్తుండటంతో పంటల సాగుకు బాగా కలిసి వస్తుంది. ఇక బయటి కన్నా ఎరువులు, మందుల ధరలు కొంత తక్కువగా ఉన్నాయి. నాణ్యమైన విత్తనాలు 40, 50 శాతం సబ్సిడీపై ఇస్తుండటంతో కొంత వరకు ఖర్చులు తగ్గుతున్నాయి. కొన్ని రైతు గ్రూపులకు యంత్రాలు, ట్రాక్టర్లు కూడా ఇచ్చారు. రైతు భరోసా డబ్బు మాకు ఎంతో ఉపయోగపడుతోంది.

– అబ్దుల్ రషీద్, రైతు అయ్యలూరు, నంద్యాల

ఈ క్రాప్ బుకింగ్‌తో ఎంతో మేలు



ఆర్బీకే సిబ్బంది ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో చేపట్టే ఈ క్రాప్ బుకింగ్‌తో మాకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పంటల బీమా పథకం కింద నష్టపరిహారం ఇస్తున్నారు. దీంతో కొంత వరకు మాకు ఊరట లభిస్తుంది. అది కూడా ఏసీజన్‌లో నష్టపరిహారాన్ని ఆ సీజన్‌లో ఇస్తుండటం అభినందనీయం.

– ఎస్.చిన్న ప్రకాశం, రైతు, జిల్లెల్ల

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ఆర్‌బీకేల్లో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నారు. ప్రస్తుతం రైతులకు అవసరైన ఎరువులను భారీగా నిల్వ ఉంచారు. మేము గతంలో నంద్యాలకు వెళ్లి విత్తనాలు, ఎరువులు, మందులు తెచ్చుకునేవాళ్లం. ప్రస్తుతం ఊర్లోనే ఆర్బీకేలో తీసుకుంటున్నాం. అక్కడి కన్నా ధర కొంత తక్కువ, అలాగే రవాణా చార్జీలు, మా ఖర్చులు మిగులుతున్నాయి. దీంతో పనులన్నీ ముగించుకొని వీలున్నప్పుడు వచ్చి తీసుకెళ్తున్నాం.

– దూదేకుల.ఖాసీం, కానాల

ఆణిముత్యాలకు సత్కారం



ప్రశంసా పత్రాలతో మోడల్‌స్కూల్ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్ సోమవారం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్వశిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి లలితకుమారి, ఏఎంఓ యూనుస్ హాజరయ్యారు. హెచ్‌ఎం అసదుల్లా హుసేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గోల్డ్ మెడల్ సాధించిన పద్మజకు రూ.3వేలు, సిల్వర్ మెడల్ సాధించిన హేమంత్‌కు రూ.2వేలు, సోమేశ్వరరావుకు రూ.వెయ్యి అందజేశారు.

ఉయ్యాలవాడ : విద్యతోనే పేదరికం దూరమవుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. సోమవారం స్థానిక మోడల్‌స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కింద కావ్యశ్రీ, అరవిందకుమార్, అలీషాబేగం, లక్ష్మిదేవి, సతీష్ కుమార్, చైతన్య కుమార్‌రెడ్డి, అలాగే హరివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గడ్డం శ్రీహన్సి, హేమంత్‌రెడ్డి, ప్రణీత్‌లకు ప్రిన్సిపాల్ నూర్జహాన్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, రామమోహన్‌రెడ్డి నగదు బహుమతి, ప్రశంసాపత్రం, షీల్డ్‌లను అందజేసి సత్కరించారు.

శిరివెళ్ల: పదో తరగతిలో ప్రతిభ చూపి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సోమవారం మోడల్, కస్తూరిబా, యర్ర గుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాల కింద నగదు పురస్కారం, మెడల్స్‌ను అందజేసి సన్మానించారు.

హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం జగనన్న



పెద్ద మకానంలో మహిళకు పథకాలను వివరిస్తున్న గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 2,3 సచివాలయాల పరిధిలోని ఆర్‌సీఎం చర్చి వీధి, పెద్దమకానం, మెయిన్ బజార్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి అందిన పథకాలు, పొందిన లబ్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు షేక్.బాబులాల్, జి.కుమార్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, కో–ఆప్షన్ సభ్యుడు జె ఇబ్రహిం, నాయబ్‌రసూల్, దాదాబీడి ఖాజాహుసేన్, చక్రం ముల్లా షబ్బీర్, ఎంపీటీసీ ఎం.ఫయాజ్, వార్డు సభ్యులు ముల్లా బురాందీన్, ఆర్‌యస్ రమణ, డి మన్సూర్, నాయకులు వెంకట రమణ, మల్లారెడ్డి, పగిడాల బాబు పాల్గొన్నారు.

క్షుద్రపూజల పేరుతో మహిళల ట్రాప్

ప్రొద్దుటూరు క్రైం: బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు పెళ్లి కాని ఆడపిల్లలకు త్వరగా పెళ్లిళ్లు అవుతాయని, ఆరోగ్య సమస్యలు పూర్తిగా నయం అవుతాయంటూ ఓ గ్యాంగ్ మహిళలను మోసగిస్తోంది. ఆర్థిక సమస్యలతో సతమతవుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని ట్రాప్ చేస్తోంది. అయితే తిరుపతికి చెందిన ఒక మహిళ ఈ ముఠా సభ్యుల చేతిలో మోసపోయింది. ఆమె ఫిర్యాదుతో మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో గ్యాంగ్‌లోని ఏడుగురిని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో అనంతపురం జిల్లాకు చెందిన వసారింటి నాగరాజు, కంబగిరి రాముడు, వడ్డే వెంకటేష్, కర్నూలు జిల్లాకు చెందిన మార్కె కంబగిరి రాముడు, మొట్టే కాంతమ్మ, నంద్యాల జిల్లాకు చెందిన జిట్టా రవికుమార్, తిరుపతికి చెందిన పాలిచెర్ల ప్రియలను అరెస్ట్ చేశారు. బాబా, మరి కొందరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యాకానుక కిట్లు పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): నూనెపల్లె మున్సిపల్ ఠాగూర్ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునిత అమృతరాజ్, హెచ్‌ఎం సుహాసిని ఆధ్వర్యంలో అందజేశారు. మాబున్నిసా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చక్కగా చదువుకోవాలన్నారు. నాయకులు గూండాల అనిల్ అమృతరాజ్, వెంకటేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రస్తా వివాదాన్ని పరిష్కరించాలి

ఉయ్యాలవాడ : ఆర్.పాంపల్లె గ్రామంలో పొలాలకు వెళ్లే రస్తా వివాదాన్ని పరిష్కరించాలంటూ గ్రామానికి చెందిన వెంకటరాముడు, వెంకటశివరాముడుతో పాటు ఉప సర్పంచ్ కందుల వెంకటసుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు స్పందిస్తూ రెవెన్యూ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

మానసిక ఒత్తిడి తగ్గిస్తే సంపూర్ణ ఆరోగ్యం

ఆళ్లగడ్డ: మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలమని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. స్థానిక శిల్పా నేచర్ హోమ్స్ ఆవరణలోని రోటరీ ఆరోగ్య వేదికలో ఆదివారం ఏరోబిక్స్, ప్రత్యేక వ్యాయామ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ వెంకటరెడ్డి, రిటైర్డ్ జిల్లా జడ్జి శివనాగిరెడ్డి, డాక్టర్ రాంగోపాల్‌రెడ్డి, డాక్టర్ ఏవీ రామసుబ్రహ్మణ్యం, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళకు గాయాలు

మిట్టపల్లె గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని లక్ష్మీనరసమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. లక్ష్మీనరసమ్మ సోమవారం ఇంటి ముందు నిల్చొని ఉండగా ఎదురింటి వ్యక్తి ట్రాక్టర్ రివర్స్ చేసే క్రమంలో అదుపు తప్పి ఆమెను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను 108 వాహనంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తీసుకెళ్లారు.

స్వచ్ఛమైన పాలన కాంగ్రెస్ సొంతం

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచిందని, స్వచ్ఛమైన పాలనను అందించే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు అన్నారు. జోడో యాత్రతో రాహుల్‌గాంధీ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచారన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, నాయకులు ఎస్‌వైడీ ప్రసాద్, రామకృష్ణ, సలాం, శివారెడ్డి, రఫీ, సద్దాం, జాకీర్, రత్నమయ్య పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి శిక్షను ఖరారు చేసినట్లు సోమవారం కోర్టు సిబ్బంది తెలిపారు. పట్టణంలో మున్సిపల్ ఆఫీసు వద్ద టూటౌన్ పోలీసులు ఏర్పాటు చేసిన డ్రంకెన్‌డ్రైవ్‌లో నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన నాగశివచరణ్‌రెడ్డి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడగా జ్యుడీషియల్ సెకెండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి మూడు రోజుల శిక్ష ఖరారు చేశారని అధికారులు తెలిపారు.

'జగనన్న సురక్ష' విజయవంతానికి ప్రణాళిక రూపొందించండి



ప్రజలను అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల: రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 23న 'జగనన్న సురక్ష' యాప్‌ను ప్రారంభించనున్నారని, కార్యక్రమం విజయవంతం చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లాధికారులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న 'జగనన్న సురక్ష' యాప్‌ను ప్రారంభించిన అనంతరం ఈ నెల 24 నుండి వలంటీర్లు ఇంటింటికి వెళ్లి అమలవుతున్న పథకాలకు సంబంధించి పౌరులతో చర్చించి సమస్యలను గుర్తించి వాటిని నమోదు చేసి, వివరాలను సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లకు ఇవ్వాలని సూచించారు. ఇందుకు సంబంధించి నంద్యాల నియోజకవర్గానికి డీఆర్‌డీఏ పీడీ, డోన్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, నందికొట్కూరుకు భూగర్భ జల శాఖ డీడీ, బనగానపల్లెకు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్, ఆళ్లగడ్డకు నంద్యాల ఆర్‌డీఓ, ఆత్మకూరుకు పట్టు పరిశ్రమ శాఖ డీడీ, పాణ్యం నియోజకవర్గానికి మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ నోడల్ అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును నాణ్యతతో వేగంగా పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో 244 దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ప్రతి సమస్యను పారదర్శకంగా అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని చెప్పారు.

స్పందనకు వచ్చిన కొన్ని వినతులు..

– నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన మల్లీశ్వరి, లక్ష్మీదేవి అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ భూమిని వేలం పేపర్ ప్రకటన ద్వారా 343/1 సర్వే నంబర్‌లో 6.18ఎకరాలు కొనుగోలు చేశామని, సదరు భూములను తమ పేర్ల మీద రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదని, ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

– కోవెలకుంట్లకు చెందిన విజయ కుమారి భర్త దొరస్వామి 2022లో అనారోగ్యంతో చనిపోయారని, తన భర్తకు శిరివెళ్ల మండలం కొమ్మినేనిపల్లె గ్రామంలో 5.40 ఎకరాల పొలం, పక్కా ఇళ్లు, గోవిందపల్లె మెట్ట గ్రామ సమీపాన 10 సెంట్ల ఇంటి స్థలం ఉన్నాయని, న్యాయ పరంగా తనకు రావాల్సిన నా భర్త ఆస్తిని నా భర్త కుటుంబ సభ్యులు ఇవ్వకుండా వేధిస్తున్నారని, పరిష్కరించి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

– బండి ఆత్మకూరుకు చెందిన బి.మహమ్మద్ అలీకి గ్రామంలోని శ్రీ జనార్దన స్వామి గుడి ఎదురుగా ఉన్న రేకుల గది గోడను సచివాలయం–1 నూతన భవనం నిర్మాణం కోసం తొలగించారని, ఇందుకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదని, పరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నంద్యాలటౌన్: డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్న మల్కాపురం గ్రామం వద్ద పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి 240 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నలుగురిని అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడిన వారిలో కర్నూల్ టౌన్ వెంకటరమణ కాలనీకి చెందిన ఈడిగ గిరిబాబు, డోన్ టౌన్ ఆటోనగర్‌కి చెందిన ఈడిగ కేశవయ్య, క్రిష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామానికి చెందిన సిలబోయిని ఆంజనేయులు, డోన్ మండలం, చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన అంపన్నగారి రామాంజనేయులు ఉన్నారని పేర్కొన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి డోన్ మండలం వలసల గ్రామానికి చెందిన బండారు రవిగా గుర్తించామని వివరించారు.

మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ చేయాలి

నంద్యాల(అర్బన్): అర్హులైన దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లను పంపిణీ చేయాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. గత మార్చి నెలలో భారతీ సీడ్స్‌లో ఎంపిక చేసిన దివ్యాంగులకు త్వరగా మూడు చక్రాల స్కూటర్లు అందేలా చర్యలు తీసుకోవాలని వికలాంగుల సంక్షేమ సూపరింటెండెంట్ అయూబ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

శిరివెళ్ల: వక్కిలేరు వాగు వద్ద రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేయగా వక్కిలేరు వాగు వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 40 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసి రుద్రవరం, గోస్పాడుకు చెందిన ఉశేనివలి, ఉస్మాన్ బాషా, అన్వర్ బాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అలాగే.. రేషన్ బియ్యం విషయంలో ఇద్దరు విలేకరులు పార్వతీశం, చంద్రమరో వ్యక్తి వెంకటకృష్ణ బియ్యం వ్యాపారిని రూ.50 వేలు డిమాండ్ చేసి రూ.20 వేలకు బేరం కుదుర్చుకున్నారు. ఒప్పందంలో భాగంగా తక్షణం రూ.6 వేలు తీసుకున్నారని వ్యాపారి అన్వర్‌బాషా ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

ఆళ్లగడ్డ: పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన బాలిక (16) అదృశ్యమైందని ఎస్ఐ వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సమస్యల సత్వర పరిష్కారానికి 'జగనన్న సురక్ష'



దొర్నిపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారెడ్డి

దొర్నిపాడు: జగనన్న సురక్ష పథకంపై స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్ రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ సుబ్బారెడ్డి సచివాలయ ఉద్యోగులు, వీఆర్ఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడిని గుర్తించి ప్రభుత్వ పథకం అందించడమే ముఖ్య లక్ష్యమన్నారు. అలాగే వలంటీర్లకు కేటాయించిన 50 ఇళ్లలో కుల, ఆదాయ, ఆడంగల్, ఆర్ఓఆర్, మ్యారేజ్, పుట్టిన తేది, మరణ ధ్రువీకరణ పత్రాలు ఏవీ కావాలన్నా వారిని గుర్తించి వెంటనే ఇవ్వాలని సూచించారు. ఎంపీడీఓ, డీటీ ఒక టీంగా, తహసీల్దార్, ఈఓపీఆర్డీ కలిసి మరో టీం సచివాలయాలకు చేరి సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. జెడ్పీటీసీ శకుంతల, తహసీల్దార్ జయప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ పాల్గొన్నారు.

రుద్రవరం: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని క్షేత్ర స్థాయిలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయ తీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్‌ఆఫీసర్లు, వీఆర్వోలు,వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ ఏఓ వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

చాగలమర్రి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తుందని ఎంఎల్ఓ (మండల లెవెల్ ఆఫీసర్) హరికృష్ణ అన్నారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం అవగాహన సదస్సును సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ కుమార్ అన్నారు.

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడం, అర్హులందరికీ సంక్షేమ పథాలు అందించడమే లక్ష్యంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చార్జీలను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పెంచిన విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలను ఉపసంహరించాలని, విద్యుత్ డిస్కమ్‌లను ప్రైవేటీకరించరాదని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మాట్లాడారు.

వేతనాలు పెంచాలి

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 29 మండలాల్లోని గ్రామాల్లో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని జిల్లా పంచాయతీ అధికారికి అందజేశారు. సుబ్బరాయుడు, హనుమంతు, సుధాకర్, మహేంద్ర పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 21వ తేదీన పట్టణంలోని టెక్కె సమీపంలోని యోగా చైతన్య నగర్‌లో ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు సామూహిక యోగా నిర్వహిస్తామని ఆయుర్వేద డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ యశోదర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.